# కంటేనే కొడుకంటే..

- డా. ప్రసాద్ కల్లూరి

"రావుగారూ! రమేష్‌బాబుగారు ఎప్పుడొస్తున్నారు?" అడిగాడు పురోహితుడు.

"బొంబే నుంచి బయలుదేరాడట. హైదరాబాద్‌దాకా ఫ్లైట్‌లో వచ్చి అక్కడ నుంచి కార్లో వచ్చేసరికి దాదాపు మధ్యాహ్నం మూడుగంటలు అవుతుంది అనుకుంటా" అన్నారు రావుగారు.

వసారాలో చక్రపాణి మాష్టారుగారి పార్థివ శరీరం అలసిసొలసి నిద్రపోతున్న పసిపాపడిలా వుంది.

ఆత్మ అనంతవాయువుల్లో కలసిపోయినా దేహం మాత్రం ఏమాత్రం విలువ కోల్పోకుండా హుందాగా కనబడుతోంది.

తల దగ్గర దీపం, తన అస్తిత్వానికి మురిసిపోతూ అంతటి మహానుభావునికి సేవ చేస్తున్నందుకు సంబరపడసాగింది.

మారుమూల గదిలో కన్నీరంతా ఆవిరైపోయి కనీసం ఏడవడానికి కూడా శక్తిలేక సొమ్మసిల్లిపడి వున్నారు శాంతమ్మగారు.

ఆవిడను కదిలించే సాహసం చేయలేదెవరూ.

పురోహితుడు కలగజేసుకుని "రావుగారూ! అసలే చలికాలపు రోజులు. త్వరగా చీకటి పడుతోంది.

అందుచేత సూర్యాస్తమయం కాకముందే దహన సంస్కారం పూర్తి చేయాలి. మరి కావాల్సిన సరంజామా అంతా సిద్ధం చేసి పెడితే రమేష్‌గారు రాగానే ప్రారంభించవచ్చు" అన్నాడు.

ఆ పనిమీద ఎవరిని పంపాలా? అని ఆలోచిస్తుంటే అప్పుడే లోపలకు వచ్చాడు ప్రకాష్.

అతనికి ఆ ఇంటితో పది సంవత్సరాల అనుబంధం.

బిఎస్‌సి బిఇడి చేసి అదే స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

పది సంవత్సరాల క్రితం హైస్కూల్ విద్యార్థిగా వచ్చాడు ప్రకాష్.

అతను ఎనిమిదో క్లాసులో ఉన్నప్పుడే యాక్సిడెంట్‌లో తల్లిదండ్రులు చనిపోవడంతో చక్రపాణి మాష్టారే తల్లీదండ్రీ అయి దగ్గరకు తీయడం జరిగింది.

రాగానే అతను చక్రపాణి మాష్టారు పాదాల దగ్గర పూలమాల పెట్టి వారి పాదాలకు తన శిరస్సును తాకించి నమస్కరించాడు. తన కంటిలో పొంగుతున్న నీటిని ఎవరూ చూడకుండా జాగ్రత్తపడ్డాడు.

"ప్రకాష్! ఓ చిన్న పని చేసి పెట్టాలయ్యా" అన్నారు రావుగారు అభ్యర్థనగా.

"అదేంటి సార్. అంతలా అడుగుతారు. నేను మాష్టారుగారికి, ఈ కుటుంబానికి ఎంత రుణపడి వున్నానో మాటల్లో చెప్పలేను సార్. చెప్పండి" అన్నాడు.

"ఏంలేదయ్యా! అన్నయ్య దహన సంస్కారానికి కావాల్సిన వస్తువుల పట్టీ సిద్ధంగా ఉంది. నేనా ఇక్కడినుంచి కదలలేని పరిస్థితి. మావాడు రమేష్ రావడానికి కనీసం నాలుగుగంటలు దాటవచ్చు. ఇప్పుడే ఫోన్ చేసాడు. అందుకని శ్రమ అనుకోకుండా బజారుకెళ్లి కావాల్సినవి తేగలిగితే, వాడు రాగానే తతంగం మొదలుపెట్టవచ్చు"

"సార్! నాకు జీవితాన్నిచ్చిన మా మాష్టారుగారికి ఆమాత్రం కూడా చేయలేకపోతే నేను మనిషి క్రింద లెక్కకాదు. ఇలా ఇవ్వండి..." అంటూ వివరాల పట్టీ, డబ్బు తీసుకుని బయలుదేరాడు.

***

ఇంట్లోకి రాగానే తండ్రి శవంమీద పడి భోరున ఏడ్చాడు రమేష్.

అతన్ని కంట్రోల్ చేయడం చక్రపాణిగారి స్వయాన తమ్ముడైన రావుగారికి సైతం చేతకాలేదు.

లోపల గదిలోకి అడుగుపెట్టిన రమేష్, తల్లిని కౌగలించుకుని ఏడ్చిన తీరు బయట ఏర్పాట్లు చూస్తున్న అందరినీ కంట తడి పెట్టించింది.

ఒక్కడే కొడుకు.

తండ్రి ప్రేరణతోనే అంతలా ఎదిగి అమెరికాలోని న్యూజెర్సీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఆరునెలల క్రితమే చేరాడు.

కొడుకు దూరంగా ఉండడం తనకి ఏమాత్రం ఇష్టం లేదు.

కానీ రమేష్ కెరీర్‌కు తన ప్రేమ అడ్డు రాకూడదని భావించి, ఎంతో కష్టంమీద భార్యను ఒప్పించారు.

ఆయనే స్వయంగా బొంబేదాకా వెళ్లి ఫ్లైట్ ఎక్కించి వచ్చారు.

అలా ఎక్కించి ఆరునెలలైనా కాలేదు. అంతలోనే అనంత లోకాలకు పయనమయ్యారు చక్రపాణి మాష్టారు.

తన స్నేహితుల సహాయంతో ఫ్లైట్ టిక్కెట్ సంపాదించి అతి కష్టంమీద తండ్రి అంత్యక్రియలకు రాగలిగాడు.

***

వైకుంఠ సమారాధాన.

ఆ రోజు తెలిసింది అందరికీ చక్రపాణి మాష్టారుని అంతలా ఆరాధించే అంతమంది వున్నారని.

ఒక మనిషి గొప్పతనం అతని మరణంలో తెలుస్తుందంటారు.

తృప్తిగా భోజనం చేసి మనస్ఫూర్తిగా దీవించారందరూ.

చక్రపాణి మాష్టారు లేని లోటు భర్తీ చేయలేనిదన్నారు.

ఆయన చలవవల్లనే ఎదిగామని ఎంతో మంది సిన్సియర్‌గా పలికారు.

అందరూ ఇక బయలుదేరుదామని అనుకునేంతలో ప్రకాష్ ఓమారు మాష్టారు ఇంటి పక్కనే వున్న స్కూల్ బిల్డింగ్‌లోకి రమ్మన్నాడు.

విషయం ఏమిటని అడిగినవారితో, అక్కడే చెబుతానన్నాడు.

అందరూ అక్కడికి చేరేటప్పటికి మీటింగ్ హాలులో ఏర్పాట్లు జరిగిపోయాయి.

స్టేజీమీద టేబుల్‌వేసి మాస్టారు ఫోటో వుంచారు. చక్కని మాలతో అలంకరించారు.


అక్కడ వెలిగించిన అగరుబత్తుల పరిమళం గదంతా వ్యాపించింది.

పక్కనే మూడు కుర్చీలు వేసారు.

ప్రకాష్ ముందుగా స్టేజీమీదకు వెళ్లి మాస్టారు గారి పటానికి నమస్కారం చేసి క్రింద కూర్చున్న వారికి కూడా నమస్కరించాడు.

క్షణంపాటు తిరిగి గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టాడు.

"అందరూ నా మాట మన్నించి ఇక్కడ సమావేశమైనందుకు ధన్యవాదాలు. ముందుగా చక్రపాణి మాస్టారుగారి అబ్బాయి రమేష్‌ని, మా హెడ్‌మాస్టారుగారిని వేదికమీదకు వచ్చి ఆశీనుల వమని అభ్యర్థిస్తున్నాను."



వెంటనే వారు వచ్చి కూర్చున్నారు.

తిరిగే తత్వమున్న వారు కూడా ఒపిగ్గా కూర్చుని ప్రకాష్ ఏమి చెప్తాడో నని ఎదురుచూడసాగారు.

ప్రకాష్ సూచన మేరకు రమేష్ మాట్లాడడం మొదలుపెట్టాడు.

"అందరికీ నమస్కారం. మొదట మా నాన్నగారి మీద వున్న అభిమానంతో ఇక్కడికి వచ్చినందుకు కృతజ్ఞతలు. మీకు వారిమీద వున్న గౌరవానికి ధన్యవాదాలు.

వృత్తిపరంగా నాన్నగారు మీకందరికీ, ఎందరికో పరిచయం. అటువంటి వ్యక్తి మనకు భౌతికంగా దూరమైనా నిరంతరం నలుగురికి మంచి చదువు చెప్పాలని తపన పడిన వ్యక్తి ఆయన. ఆయన కొడుకుగా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని నా సంకల్పం. ఇందులో భాగంగా నాన్నగారి పేరుమీద ఒక స్కూలు కట్టించి ఒకటి నుంచి ఏడవ తరగతిదాకా నడపాలన్నది నా కోరిక.


## సరికొత్త రోబో

జపాన్ శాస్త్రవేత్తలు కొత్తగా ఒక రోబోను తయారు చేసారు. ఐఎఫ్ అని పిలువబడే ఈ రోబో ఎత్తు కేవలం 40 సెం.మీ. బరువు ఐదుకిలోలు. జపాన్‌కు చెందిన బిజినెస్ డిజైన్ లాబరేటరీస్ సృష్టించిన ఈ రోబో మన ముఖంలోని భావోద్వేగాలను క్షణాల్లో పసిగట్టి ఠకీమని చెప్పగలదు. మనిషి గొంతుకనుబట్టి వారు సంతోషంగా ఉన్నారా, విషాదంగా ఉన్నారా? అని ఇట్టే చెప్పగల ఈ రోబోకు మరో గుణం కూడా వుంది. ఒకవేళ యజమానికి కోపంవస్తే సారీ అని చెప్పి బుజ్జగించే దీని ధర చాలా స్వల్పం. కేవలం లక్షా ఇరవై ఐదువేల రూపాయలు మాత్రమే.

## కొత్తరకం వీడ్కోలు

హైస్కూలు చదువు పూర్తిచేసుకుని వెళ్ళే విద్యార్థులకు జూనియర్స్ అంతా కలిసి ఫేర్‌వెల్ పార్టీ ఇవ్వడం మనకు తెలిసిన విషయమే. అయితే థాయిలాండ్‌లోని తామ్‌సీలో మాత్రం ఈ కార్యక్రమాన్ని ఒక విచిత్ర పద్ధతిలో జరుపుకుంటారు. ఆ నగర మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ వేడుక ఎంతో సరదాగా ఉంటుంది. ఈ వేడుకలో వింతగా విద్యార్థులంతా నల్ల టీషర్టులు, కళ్లద్దాలు ధరించడమే. కాదు. ప్రత్యేకంగా తయారుచేసిన రెండున్నరలక్షల నీళ్ళ బెలూన్‌లను కూడా ఉపయోగించుకుంటారు. ఒకళ్ళ మీద ఒకళ్ళు నీళ్ల బెలూన్లు విసురుకుంటారు. ఏటా జరుపుకునే వీడ్కోలు కార్యక్రమం జీవితాంతం స్కూలు జ్ఞాపకాలు మనో ఫలకం మీద ముద్రించినట్లు ఉండిపోవాలని అధికారులే ఈ పద్ధతికి వీలు కల్పించారు.

-పి.వి.రమణకుమార్




ఈ విద్యాదాన మహాయజ్ఞంలో నాకు మీ సహాయ సహకారాలు ఎంతో అవసరం. ఈ కార్యక్రమంలో భాగంగా మొదట అనువైన బిల్డింగ్ అవసరం. మా అమ్మగారి సూచన మేరకు బిల్డింగ్ నిమిత్తం మూడు లక్షల రూపాయలు ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. తెలిసిన ఇంజనీర్‌గారి అభిప్రాయం ప్రకారం ఇంకో రెండు లక్షల రూపాయలు అవసరం. అది కూడా నెలలోపు నేను సర్దుబాటు చేస్తాను.

కాకపోతే ఒక చిన్న సమస్య వచ్చింది. మన వూర్లో సరైన సైట్ ఎక్కడ వుందో నాకు సరిగ్గా తెలియదు. పిల్లలు బడికి రావడానికి అనుకూలంగా ఉండాలి. మీకు ఏమైనా తెలిసి ఉంటే చెప్పండి. ప్రయత్నం చేద్దాం" అంటూ ముగించాడు రమేష్.

రెండు నిముషాలు ఎవరూ మాట్లాడలేదు.

అంతలో హెడ్‌మాష్టారు కల్పించుకుని "నాకు తెలిసినంతలో తూర్పు వీధిలో మంచినీళ్ల బావి ప్రక్కన కాంపౌండ్ కట్టి గేటు సైతం పెట్టివున్న ఖాళీ ప్రదేశమే అనువైనది.

కాకపోతే ఎన్నో రోజులుగా ఆ గేట్ లాక్ చేయబడి ఉంది. ఆ చోటుకు అసలు యజమాని ఎవరో ముందుగా తెలుసుకోవాలి. అంతేకాక ఆ స్థలం మంచి సెంటర్‌లో వుంది. ఎంత హీనంగా చూసినా లక్షన్నరకు తక్కువకు ఇవ్వరు.

అటువంటప్పుడు మన బిల్డింగ్ ధర కూడా హెచ్చుగా వుంటుంది. ఇవన్నీ మీ దృష్టికి ఎందుకు తీసుకువచ్చానంటే చక్రపాణి మాష్టారుగారి పేరు మీద మనం తలపెట్టే ఏ కార్యక్రమమైనా మంచి ప్రదేశంలో, అందరికీ అందుబాటులో ఉండాలని నా ఆలోచన. అందుకని మనం అందరం నడుం బిగించి కనుక్కుంటే మంచిది" అన్నాడు.

అందరూ అందుకు అంగీకరించారు.

దానికి తోడుగా ఎవరికి తోచింది వారు ఒక వారం రోజులలోపు రమేష్‌కు అందజేసేలా తెలిపారు.

ఆ క్షణం నుంచే తన బాధ్యత పెరిగిందని గ్రహించాడు రమేష్.

***

అనుకుంటూ ఉండగానే వారంరోజులు గడిచిపోయాయి.

ఇక తను కేవలం రెండువారాలే ఇండియాలో ఉండగలడు. అందుకే చాలా టెన్షన్ ఫీలయ్యాడు రమేష్.

తను వెళితే తల్లి పరిస్థితి ఏమిటో అర్థం కాలేదు అతనికి. అదే మాటను ఆమెతో అన్నాడు.

"నాన్నా రమేష్ నాది క్రుంగుతున్న బ్రతుకు. మీ నాన్నగారి దగ్గరికి ఎంత త్వరగా చేరగలనా? అన్నదే నా ఆలోచన. అలా అని నా బాధ్యతల నుండి తప్పుకుంటానని కాదు. ముందుగా మీ నాన్నగారు కలలుగన్న విద్యాసంస్థను స్థాపించాలి.

ఆ చదువుల నిలయం తిరిగి మీ నాన్నగారి ప్రేరణను అందరిలోనూ నింపగలగాలి. అలాంటి ఉద్దేశ్యంతోనే మొన్న నీకు మూడులక్షలు మనం ఇద్దామని చెప్పాను.

మీ నాన్నగారు దాదాపు పాతిక సంవత్సరాలుగా ఇక్కడ ఉండడం జరిగింది. ఇన్నాళ్ళూ ఇక్కడి మనుషులు, ఈ వాతావరణం మా జీవితాలతో ముడిపడిపోయాయి. అందుచేత వాళ్లకి ఈ మాత్రం ప్రత్యుపకారం చేయలేకపోతే మన జీవితాలకి అర్థం లేదు. నీ కెరీర్ ఏమాత్రం పాడు కాకూడదు.

అందుకే నేను ఒక నిర్ణయానికి వచ్చాను. మీ నాన్నగారు తన కష్టార్జితంతో కట్టించిన ఈ ఇంట్లోనే వుంటూ వారి ఆశయ సాధన కోసం కృషి చేస్తాను.

నేను ఒంటరిగా ఉన్నానని నీవేం అనుకోనక్కర్లేదు. భగవంతుడి దయ

వల్ల తెల్లారిన దగ్గర్నుంచీ ఈ వీధిలోని ప్రతి ఒక్కరూ సొంత పిల్లల్లా వచ్చి పలకరిస్తారు. అంతేకాక..." ఆవిడ మాట పూర్తికాకముందే అక్కడికి వచ్చాడు ప్రకాష్.

శాంతమ్మగారి కాళ్లకు నమస్కరించి, రమేష్‌ని పలకరించి అతను ఆఫర్ చేసిన కుర్చీలో కూర్చున్నాడు.

"అమ్మా! ఏదో ముఖ్యమైన విషయం గురించి మాట్లాడుకుంటున్నారులా వుంది. డిస్టర్బ్ చేసి వుంటే మన్నించండి" అన్నాడు అభ్యర్థనగా.

"అదేంలేదయ్యా! అయినా నాకు మా రమేష్ ఎంతో నువ్వు కూడా అంతే నని నీకు తెలియదా. మా ఇంట్లో పది సంవత్సరాలుగా మెలుగుతున్నావు. నీకు తెలియని విషయాలు ఏమీలేవు" అంది శాంతమ్మగారు.

ఇంతలో రమేష్ వచ్చాడు. "ఏంలేదు ప్రకాష్. మనం ప్లాన్ చేసిన స్కూల్ ప్రాజెక్ట్ గురించి చర్చిస్తున్నాం. ఆ ప్రాజెక్ట్ పూర్తి కావడానికి ఆర్నెల్లు పడు తుంది. ఇప్పటివరకూ మనం అనుకున్న స్థలం గురించి ఏమీ డిసైడ్ కాలేదు.

అంతేకాక నేను రెండువారాల్లో స్టేట్స్‌కు బయలుదేరాలి. నేను వెళితే అమ్మ ఇక్కడ ఒక్కతే ఉంటుంది. తనను గురించే ఆందోళనగా వుంది" అన్నాడు.

"రమేష్‌బాబూ! వయస్సులో మీరు నాకన్నా సంవత్సరం చిన్న. ఆ చను వుతోనే ఇలా మాట్లాడుతున్నాను. మరోలా అనుకోకండి. ఊహ తెలియని వయస్సులో మా తల్లిదండ్రులు దూరమైతే మీ నాన్నగారు నన్ను అక్కున చేర్చుకుని ఆదరించి ఒక అస్థిత్వాన్ని కల్పించారు. ఈ రోజు నా ఈ స్థితి ఆయన పెట్టిన భిక్ష. నా జీవితాన్ని నిలబెట్టిన ఆ మహానుభావుడికి నేను జీవి తాంతం రుణపడి వుంటాను. ఇక అమ్మగారి విషయానికొస్తే, ఇప్పుడే అన్నారు నేను మీతో సమానమని. అంటే నాపట్ల వారికి పుత్రవాత్సల్యం ఉందన్నమాట. అలాంటిది నేను ఇక్కడ ఉండగా అమ్మ ఎప్పటికీ ఒంటరి వారు కారు. మీరు నిశ్చింతగా ఉండండి. మరో విషయం..." అంటూ లేచి తన చేతిలోవున్న కవరులోంచి కొన్ని డాక్యుమెంట్స్ తీసి శాంతమ్మగారికి అందజేసాడు.

కళ్లజోడు సరి చేసుకుని వాటివైపు చూసారు. ఏదో రిజిస్ట్రేషన్ డాక్యు మెంట్స్.

"దేనికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఇవి?" అడిగింది శాంతమ్మ.

"ఏంలేదమ్మా. రమేష్‌బాబు ఏ సైట్‌లో స్కూల్ బిల్డింగ్ కట్టాలనుకు న్నారో ఆ సైట్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్. అసలు విషయం ఏమిటంటే ఆ స్థలం మా నాన్నగారు నా పేరుమీద కొని రిజిస్ట్రేషన్ చేయిం చారు. మైనారిటీ తీరిన నాకు ఆ చోటు సొంతమయింది. ఒంటరిగాడిని ఇక నాకు అది అవసరమనిపించలేదు. మాస్టారి ప్రోత్సాహంతో నేను ఒక టీచ ర్‌గా స్థిరపడ్డాను. ఈ జీవితం ఇలా జరిగిపోతే చాలు. అందుకే ఉడుతాభక్తిగా మీరు సంకల్పించిన స్కూలు నిర్మాణానికి మనఃపూర్వకంగా ఆ స్థలాన్ని మీ పేరుమీద మార్చి ఆ పేపర్లు తీసుకువచ్చాను. కన్నతల్లిలా నన్ను ఆదరించిన మీరు ఏమాత్రం అడ్డు చెప్పకుండా ఈ కొడుకు చేస్తున్న ఈ పనిని అంగీక రిస్తే నా అంత అదృష్టవంతుడు లేడనుకుంటాను" అన్నాడు సిన్సియర్‌గా.

క్షణంపాటు ఎవ్వరూ మాట్లాడలేదు. ఏమీ అర్థం కానట్టు ప్రకాష్‌వైపు చూసాడు రమేష్.

"రమేష్‌బాబూ! మీ ఉద్దేశ్యం నాకు అర్థమయింది. ఆ రోజు మీటింగ్‌లో ఇదే సైట్ గురించి అంతలా చర్చించినప్పుడు నేను ఎందుకు నోరు మెదపలే దని మీరు అడగవచ్చు. ఒకే ఒక్క కారణం. కృతజ్ఞతతో నేను చేస్తున్న పని అజ్ఞాతంగా జరగాలని నా కోరిక. అందరికీ తెలిసేలా పబ్లిసిటీ ఇచ్చుకోవడం నాకు ఇష్టంలేదు.

ఏ క్షణాన మీరు స్టేజీమీద నుంచి ఈ ప్రతిపాదన చేసారో ఆ నిముషమే నా మనసులో ఒక నిర్ణయం తీసుకున్నాను. అందుకే ఆ సైట్ మీద పూర్తి అధి కారాన్ని అమ్మగారి పేరు మీద ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఈ డాక్యుమెంట్స్ ప్రిపేర్ చేయించాను. చంద్రునికో నూలుపోగులా మా చక్రపాణి మాస్టారుగారి సంకల్ప యజ్ఞంలో ఓ చిన్న సమిధగానైనా నిలవాలన్న నా కోరికను కాదన కండి" అంటూ శాంతమ్మగారి పాదాలకు నమస్కారం చేసాడు.

కొన్ని అద్భుతమైన అనుభూతులను ఎవరి మనసులో వారు దాచుకో వడం మంచిది.

అందుకు కారణం అవి కేవలం అనుభవైకయోగ్యం కాబట్టి. ఆ క్షణాన శాంతమ్మగారి పరిస్థితి అలాగే వుంది.

ముందుకు వంగి ప్రకాష్‌ను ఆశీర్వదిస్తున్న ఆమె కంటినుండి రాలిన కన్నీటి చుక్కలు అక్షతల్లా పడ్డాయి అతని తలమీద.

ఆ అద్భుత సన్నివేశాన్ని తన మనసులో పదిలపరచుకున్నాడు రమేష్.

అందుకే అన్నారు పెద్దలు 'కంటేనే కొడుకు కానవసరంలేదని'

✡

## అలరించే అంశం



మనమేదైనా అనుకుంటే పైనుంచి తథాస్తు దేవతలు ఉంటారని అంటుంటారు. అందుకేనేమో ఎప్పుడూ నెగిటివ్‌గా ఆలో చించకూడదంటారు. కొత్త దనంతో కూడిన సినిమా లకి ఎప్పుడూ ప్రేక్షకుల ఆదరణ ఉంటుందని చెబుతున్నారు కర్మా ఎంటర్‌టైన్‌మెంట్స్ వారు. అమీషాపటేల్, జయప్రద, సంజయ్ దత్ తదితరులు నటి స్తున్న 'తథాస్తు' చిత్రం అన్నివర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందని చెబుతు న్నారు. అందాల హీరోయిన్ అమీషాపటేల్ ఈ చిత్రంలో కొత్తగా కన్పిస్తుందట. ఈకొత్తదనం ఈ చిత్రానికి ఏమేరకు ఉపయోగపడు తుందో చూడాలి మరి!

